













రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి రిమాండ్



జయప్రకాష్ శ్రీను దుర్గారావు

నిడమనూరు: మండలంలోని వేంపాడ్ స్టేజీ సమీపంలో డిసెంబర్ 25న టాటా ఏస్ వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు హాలియా సీఐ గాంధీనాయక్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆయిల్ ట్యాంకర్‌ను నడిపిన క్లీనర్ పేరారపు జయప్రకాశ్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదని, అదేవిధంగా డ్రైవర్ శ్రీను డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగిసిందని సీఐ పేర్కొన్నారు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు వారికి వాహనం ఇచ్చిన ఆయిల్ ట్యాంకర్ యజమాని తోట దుర్గారావుపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్ చేశామని తెలిపారు. డ్రైవర్ శ్రీను, క్లీనర్ జయప్రకాశ్ స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామం కాగా.. ఆయిల్ ట్యాంకర్ ఓనర్ దుర్గారావు సొంతూరు తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు పట్టణమని సీఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన ఖలీమొద్దీన్ శనివారం రాత్రి సాగర్ రోడ్డులో గల గాంధీ విగ్రహం వద్ద హోర్డింగ్ ఎక్కి హల్‌చల్ చేశాడు. తనకు పెళ్లి కాలేదని, కుటుంబ సభ్యులు సైతం పట్టించుకోవడం లేదని మద్యం మత్తులో హంగామా సృష్టించాడు. అతడిని కిందకు దింపేందుకు స్థానికులు ప్రయత్నించగా కిందకు దూకుతానని బెదిరించాడు. ఇద్దరు వ్యక్తులు పైకి ఎక్కి అతడిని పట్టుకుని అక్కడే కూర్చున్నారు. టూటౌన్ సీఐ నరసింహారావు తన సిబ్బందితో వచ్చి కిందకు దింపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు.

ఎమ్మెల్యేకు వినతి

కొండమల్లేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎంపీపీ రేఖ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యడమ సుమతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

హాలియా: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్ అన్నారు. ఆదివారం హాలియాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు.







